కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

కార్మికుల హక్కులను కాలరాసిన మోడీ సర్కార్

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు, హక్కులను కాలరాస్తోందని, తద్వారా ఎంతోమంది కార్మికులు, ఉద్యోగులు నష్టపోతున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పేర్కొన్నారు. పుట్టపర్తిలో శనివారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి జి.ఓబులు మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డెయిలీవేజ్, కంటినెంట్ ఉద్యోగుల రెగ్యులరైజ్, నాలుగు లేబర్ కోడ్ల రద్దు, కార్మికుల హక్కుల పునరుద్ధరణ, పని ప్రదేశంలో సమానత్వం, భద్రత, అసంఘటిత రంగ కార్మికులను రిజిస్ట్రేషన్‌తో పాటు పెన్షన్, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులను ఈఎస్ఐలో చేర్చడం, సంక్షేమ నిధి ఏర్పాటు, ఈ శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులందరికీ ఆరోగ్య పథకాలు, ప్రసూతి ప్రయోజనాలు, జీవిత వైకల్య బీమా అమలు, నూతన పెన్షన్ పద్ధతి రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, పంటలన్నింటికీ(ఆహార, వాణిజ్య, ఉద్యాన, సామాజిక, వన) సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి ఎంఎస్‌పిలను నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలన్నారు. రైతులు, పేదలపాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరణ, ఇప్పటికే ఉన్న 24 కోట్ల మీటర్లను తొలగించరాదని, వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించడం ఆపాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు, రైతుల పంట రుణాల బకాయిలను ఒక పర్యాయం రద్దు, కేరళ తరహాలో 'రైతు రుణ ఉపశమన చట్టం'ను పార్లమెంటులో ఆమోదించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలన్నారు. కార్పొరేట్ అనుకూల ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని ఉపసంహరించాలని, సమగ్ర ప్రభుత్వ రంగ పంటల బీమా సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. వాతావరణ మార్పు, కరువు, వరదలు, పంట సంబంధిత చీడపీడల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు బీమా పథకం అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200రోజులకు పెంపు, రోజు వేతనం రూ. 600, పట్టణ ప్రాంతాలోల ఉపాధి హామీ చట్టం అమలు, వలస కార్మికులకు సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. ఇప్పటికే వున్న అంతర్ రాష్ట్ర వలస కార్మికుల ఉపాధి నియంత్రణ చట్టం-1979ని బలోపేతం చేసి, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికుల సమస్యలపై చేపట్టనున్న 36 గంటల దీక్ష కరపత్రాలను వారు విడుదల చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్, నాయకులు రామకృష్ణ, బాల్ల అంజి, శివ, సిద్దు, అంగన్వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు మాబున్నీషా, కార్యదర్శి శ్రీదేవి, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు బావమ్మ, చంద్రకళ, లక్ష్మీదేవి, వసంత, లావణ్య, మహదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఫీవర్

- ఉమ్మడి జిల్లాలో క్రికెట్ సందడి
- నేటి ఫైనల్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి
- పలు ప్రాంతాల్లో బిగ్ స్క్రీన్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురంప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ ఫీవర్ కొనసాగుతోంది. ఆదివారం నాడు అహ్మదాబాద్‌లో ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారతదేశంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇండియా లీగ్ దశ నుంచి కూడా అప్రతిహాతంగా ఓటమి అన్నది లేకుండా విజయాలు సాధిస్తూ వచ్చింది. దీంతో ఫైనల్ విజయావకాశాలపైనా అంచనాలు భారీగానే ఉన్నాయి. నేడు జరిగే ఫైనల్లో కూడా గెలిస్తే ఓటమిన్నది లేకుండా గెలిచిన జట్టుగా ఇండియా ఉండబోతోంది. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగులోనూ అందరు ఆటగాళ్లు మంచి ఫామ్‌లో ఉండి రాణిస్తుండటం ప్రపంచకఫ్ విజయంపై అంచనాలు భారీగా పెరిగాయి. దీంతో ఎక్కడ చూసినా నేడు జరిగే ఫైనల్స్‌పైనే చర్చ నడుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్ కోసం ఉమ్మడి క్రికెట్ అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ప్రపంచ కప్ విజయం తరువాత ఏ రకంగా సంబరాలు చేసుకోవాలన్న ప్లాన్‌లోనూ ఉంటున్నారు.

ప్రత్యేకమైన ఏర్పాట్లతో సిద్ధం

టీమ్ ఇండియా ప్రపంచ్ కప్ ఫైనల్ విజయం కోసం ప్లాన్ చేసుకుంటుంటే, అభిమానులు ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు ప్రత్యేకంగా ప్లాన్‌లు చేసుకుంటున్నారు. అనంతపురం నగరంలో అయితే పిటిసి స్టేడియంలో భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసేందుకు అభిమానులు సిద్ధమయ్యారు. పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి నగరవాసులు అత్యధిక మంది అక్కడ మ్యాచ్‌ను తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే రకంగా మరికొంత మంది హోటల్స్‌లో సన్నిహితులతో కలసి మ్యాచ్‌లు తిలకించే విధంగా ప్లాన్ చేసుకున్నారు. ఆదివారం కూడా కావడంతో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకుని భారత విజయాన్ని ఆకాంక్షిస్తూ సంబరాలకు సిద్ధమయ్యారు.

బెట్టింగ్‌లకు సిద్ధం

ఇదే సమయంలో బెట్టింగ్‌లకు బెట్టింగ్ జూదరులు సిద్ధమవుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు కొంత మంది సిద్ధమవగా, మరికొంత మంది వ్యక్తిగతంగానూ పందేలు కాయడానికి సిద్ధమవుతున్నారు. అయితే ఇప్పటికే పోలీసు శాఖ వీటిపై నిశితంగానే దృష్టి పెట్టింది. ఇటువంటివి చోటు చేసుకున్నట్టు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు సైతం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఫైనల్ మ్యాచ్ కావడంతో అందరి అంచనాలు భారీగానే ఉంటున్నాయి.

ఇండియా జట్టు పటిష్టంగా ఉంది

టీమ్ ఇండియా జట్టు బ్యాటింగ్, బౌలింగ్ అన్ని విభాగాల్లోనూ గతంలో ఎన్నడూ లేనంత పటిష్టంగా ఉంది. అందుకే లీగ్ దశ నుంచే ఒక్క ఓటమి అన్నది లేకుండా వరుస విజయాలు సాధిస్తూ వచ్చింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియాను ఓడించి మూడవసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంటుందన్న నమ్మకముంది.

టివి.చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ క్రికెటర్.

టీమ్ ఇండియా గెలుస్తుంది

టీమ్ ఇండియా ఫైనల్ మ్యాచ్‌లోనూ గెలవాలని ఆకాంక్షిస్తున్నా. ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓటమన్నది లేకుండా ఏ రకంగా గెలుపొందిందో... అదే రకంగా ఫైనల్ మ్యాచ్‌లోనూ గెలుపొంది.. ప్రపంచ కప్ విజేతగా నిలవాలని కోరుకుంటున్నాం.

నరేష్, యువకుడు.

రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, కలెక్టర్, ట్రస్టు సభ్యులు

రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ఈనెల 22న పుట్టపర్తికి రానున్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా అందుకు తగిన ఏర్పాట్లను శనివారం నాడు అధికారులు, ట్రస్టు సభ్యులు పరిశీలించారు. కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, శ్రీ సత్యసాయి ట్రస్ట్ రత్నాకర్, జాయింట్ కలెక్టర్ టిఎన్.చేతన్, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలసి పుట్టపర్తి విమానాశ్రయం, పుట్టపర్తి ప్రశాంతి నిలయం, సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్, రాష్ట్రపతి బస చేసే సాయి శ్రీనివాస్ అతిథి గృహం తదితర ప్రాంతాలను పరిశీలించారు. రాష్ట్రపతి ద్రౌపతిముర్ము ఈనెల 22న మధ్యాహ్నం 12:30 గంటలకు బెంగళూరు నుంచి భారత వాయు సేన విమానంలో శ్రీసత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి పుట్టపర్తికి వస్తారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా విమానాశ్రయం నుంచి పుట్టపర్తి వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులనూ రానీయొద్దు

పుట్టపర్తి అర్బన్ : భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈనెల 22వ తేదీన పుట్టపర్తిని సందర్శించనున్నారని ఇందుకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈనెల 22న మధ్యాహ్నం 12:30 గంటలకు బెంగళూరు నుంచి భారత వాయుసేన విమానంలో జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి చేరుకుని అక్కడినుంచి ప్రశాంతినియానికి చేరుకుంటారన్నారు. సత్యసాయి యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవంలో పాల్గొంటారన్నారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి విస్తతమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను జవహర్ రెడ్డి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ పర్యటనకు భారీ ఏర్పాట్లు చేపట్టామన్నారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ మాధవరెడ్డితో సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటన సంబంధించి ప్రోటో కాల్ నిబంధన ప్రకారం తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. బందోబస్తు ఇతర ఏర్పాట్లపై వీడియో లింకు ద్వారా పోలీస్ డైరెక్టర్ జనరల్ రాజేంద్రనాథ్ రెడ్డి కూడా సమీక్షించారు. వైద్య ఆరోగ్యశాఖ పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సిఎస్ మాట్లాడుతూ డిఎంఈవి స్వయంగా మంగళవారం పుట్టపర్తికి వెళ్లి జిల్లా కలెక్టర్ ఎస్పీ తదితర అధికారుల సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్ విభాగం ద్వారా రాష్ట్రపతి పర్యటన సంబంధించి ప్రూఫ్ ప్రోగ్రామ్ సహా ఆహ్వాన కార్డులు సక్రమంగా అందరికీ అందేవిధంగా చూడాలని రాష్ట్ర ప్రోటోకాల్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డిని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కదిరి టౌన్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఇందుకు పాల్పడేవారు శిక్షార్హులని డిస్ట్రిక్ చైల్డ్ ఫండ్ ఆఫీసర్ వెంకటేశ్వరి తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా॥బిఎన్.శ్రీదేవి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా కదిరి పట్టణం కేజీబీవీ పాఠశాలలో బాలల హక్కులపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యతనంలో సమస్యలు తలెత్తితే చైల్డ్ హెల్ప్ లైన్ 1098ను సంప్రదించాలన్నారు. బాల్య వివాహాలు, బాల్య వివాహ నిషేధం చట్టం 2006, పొక్సో చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మమత, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సోషల్ వర్కర్ నాగలక్ష్మి, కేజీబీవీ ఎస్ఓ ఇన్‌ఛార్జి లక్కమ్మ, కేజీబీవీ టీచర్లు అన్నపూర్ణ, 1098 సిబ్బంది నిర్మల పాల్గొన్నారు.

సంబరంగా బాబా జయంతి ఉత్సవాలు

◆ వేణుగోపాలస్వామి రథోత్సవంతో వేడుకలు ప్రారంభం ◆ పుట్టపర్తిలో భక్తులు, పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తిలో సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. సత్యసాయిబాబా 98వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తిలోని సాయికుల్వంత్‌హాలులో శనివారం ఉదయం భక్తుల సాయి నామస్మరణ మధ్య వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా భక్తులు రథాన్ని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ప్రశాంతి నిలయం గోపురం గేట్ వరకు లాగారు. సాయి కుల్వంత్ హాలులో వేద పండితులు, సాయి విద్యార్థులు వేదాలు పఠిస్తూ వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి భజనలు, సంకీర్తనల మధ్య తిరిగి వేణుగోపాలస్వామి ఆలయం వరకు లాగారు. రథోత్సవాన్ని సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ట్రస్టు సభ్యులు ప్రారంభించారు. రథయాత్ర ముందు భక్తుల నృత్యాలు, వేషధారణలు, కోలాటం, చెక్కభజన, గురవయ్యలు, కీలుగుర్రాలు, తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బాబా జయంతి ఉత్సవాల సందర్భంగా నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తిని సత్యసాయి విద్యార్థులు తిరిగి మేళతాళాల మధ్య సాయి కుల్వంత్ హాలుకు తీసుకెళ్లారు. అంతకుముందు సాయి కుల్వంత్ హాలులో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. రథోత్సవంలో దేశ విదేశీ భక్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వాసుదేవన్ ఆధ్వర్యంలో సిఐ కొండారెడ్డి, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులతో పాటు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా సత్యం, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో నారాయణ సేవ ప్రారంభం

పుట్టపర్తి రూరల్ : శ్రీసత్యసాయి 98వ జయంతి ఉత్సవాల సందర్భంగా దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రశాంతి నిలయంలో 6 రోజుల పాటు నిర్వహించనున్న నారాయణ సేవను శనివారం సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్‌జె.రత్నాకర్ ప్రారంభించారు. నార్త్ బిల్డింగ్ వెనుక వైపున మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు అన్నప్రసాదం అందజేస్తారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా 12 కౌంటర్ల చొప్పున ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 850 మంది సత్యసాయి సేవాదళ్ సభ్యులు పాలుపంచుకోనున్నారు. రత్నాకర్ శనివారం భక్తులకు అన్నప్రసాదం పంపిణీని ప్రారంభించారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు

మొక్కను నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మౌనిక హాల్ పక్కన నూతనంగా నిర్మంచిన వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కదిరి మున్సిపాలిటీలో నాలుగు వైపులా 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నామని, ఇందులో నేడు 3వ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. అనంతరం పిహెచ్‌సి ఆవరణలో ఎమ్మెల్యే మొక్క నాటారు.

బుక్కపట్నం చెరువు నింపాలని రైతుల నిరసన

బుక్కపట్నం : హంద్రీనీవా నీటితో బుక్కపట్నం చెరువును నింపి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు బుక్కపట్నంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా చెరువు నింపాలని ఇదివరకే ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని తెలిపారు. ఈ చెరువు ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా 3వేల ఎకరాలు సాగులోకి వస్తాయని, తద్వారా రైతులతో పాటు రైతు కూలీలకూ జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. రైతుల నిరసనకు సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు.

శిశుసంరక్షణ, సురక్షిత పోషణ ముఖ్యం

ప్రజాశక్తి-హిందూపురం

నవజాత శిశు సంరక్షణతో పాటు సురక్షిత పోషణ చాలా ముఖ్యమని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ కేశవులు తెలిపారు. నవజాత శిశు పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ కేశవులు పాల్గొన్నారు. పిల్లల రక్షణకు ఆరోగ్య కేంద్రాలు, సమాజం చేపట్టాల్సిన చర్యలను వివరించారు. చిన్నపిల్లల విభాగం అధిపతి డా.లింగన్న శిశు సంరక్షణతో పాటు వారిలో గమనించాల్సిన ఆరోగ్య సమస్యలను వివరించారు. సుపరింటెండెంట్ డా. రోహిల్ కుమార్, వైద్యులు శ్రీకాంతి శిశువులో తరచూ వచ్చే సమస్యలు, తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, తల్లులు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్ : ఎడిజె

ప్రజాశక్తి-హిందూపురం

కేసుల పరిష్కారంలో బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. డిసెంబర్ 9వ తేదీ నిర్వహించే మెగా లోక్ అదాలత్‌పై శనివారం స్థానిక అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీధర్, రాజ్యలక్ష్మి, డిఎస్‌పి కన్జాంక్షన్‌లతో ఆమె సమీక్ష నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి బ్యాంకు, పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లేపాక్షికి వచ్చే యాత్రికులను ఇబ్బందులకు గురి చేయకుండా నిబంధనల మేరకు పార్కింగ్ ఫీజు వసూలు చేయాలని ఎడిజె ఆదేశించారు. రోడ్లపై సమావేశాలు నిర్వహించడం, ప్రజలకు ఇబ్బందులు కలగజేయడం, ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, తదితర అంశాలపై డిఎస్పి, మున్సిపల్ అధికారులతో చర్చించి అందుకు అనుగుణంగా సూచనలు చేశారు. సమావేశంలో రెండవ తరగతి మెజిస్ట్రేట్ సుకుమార్, ఎజిపి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీపి సుహాసిని, పోలీసు అధికారులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్య సాయి గ్లోబల్ కౌన్సిల్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పుట్టపర్తి

విదేశీ, స్వదేశీ వైద్యులతో శ్రీ సత్య సాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన డాక్టర్ గీత కామత్ ఆధ్వర్యంలో 64 మంది డాక్టర్లతో ఉచిత వైద్య శిబిరాన్ని పుట్టపర్తిలో శనివారం ఏర్పాటు చేశారు. నార్త్ బ్లాక్‌లో శ్రీ సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ గీత కామత్ మాట్లాడుతూ సత్యసాయి జన్మదిన సందర్భంగా ప్రశాంతి నిలయంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు ఈ సేవలు ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. శనివారం నాడు 500 మంది మహిళలు, 450 మంది పురుషులకు డాక్టర్లు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆప్తమాలజీ, ఈఎన్‌టి, క్యాన్సర్, డెర్మటాలజీ, పల్మనరీ, గైనకాలజీ, డయాబెటిక్ తదితర జబ్బులకు ఈ శిబిరంలో చికిత్సలు అందించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఉన్న డాక్టర్లతోపాటు ఆదివారం నాడు అదనంగా ఆర్థోపెడిక్, కార్డియాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, స్కిన్ స్పెషలిస్ట్ వైద్యులు ఈ శిబిరానికి రానున్నారు.వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు గీతకామత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ నేపాల్, డాక్టర్ నగేష్, సుందరం, కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, వైద్య బందం పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితి పట్టించుకోని ఎమ్మెల్యే

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

అధ్వానంగా ఉన్న రహదారి వద్ద నిరసన తెలుపుతున్న బికె.పార్థసారథి, టిడిపి నాయకులు

పట్టణంలోని రోడ్ల దుస్థితిని ఎమ్మెల్యే శంకరనారాయణ పట్టించుకోవడం లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి ధ్వజమెత్తారు. పార్థసారథి ఆధ్వర్యంలో శనివారం టిడిపి, జనసేన నాయకులు పట్టణంలోని కోనాపురం వెళ్లే రోడ్డులో నిరసన తెలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్థసారథి మాట్లాడుతూ కోనాపురం రోడ్డు చాలా అధ్వానంగా ఉందని, దీంతో కోనాపురం, కొండాపురం, మంగాపురం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రైల్వేస్టేషన్లకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఇంటికి సమీపంలో ఉన్నా పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. టిడిపి హయాంలో నియోజకవర్గంలో 500 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు వేశారని తెలిపారు. అభివృద్ధి కావాలంటే టిడిపి, జనసేన పార్టీలను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కుమార్, టౌన్ కన్వీనర్ లోకేష్, టిడిపి టౌన్ కన్వీనర్ రవిశంకర్, కన్వీనర్లు సిద్దయ్య, సిద్దలింగప్ప, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, రఘువీరాచౌదరి, నాయకులు చిన్న వెంకటరాముడు, కేశవయ్య, హుజూర్, కౌన్సిలర్లు గిరి, గీత హనుమంతు, రామలింగ, సంజీవరెడ్డి, కన్నా స్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, విజి పాలెం శ్రీనివాసులు, బోయ అనిల్‌కుమార్, చంద్ర కాంతమ్మ, బేబీ, అది, శంకర్, హరికష్ణ, గుట్టూరు నాగరాజు, వాజిద్, సయ్యద్, భాస్కర్ రెడ్డి, శివ శంకర్, చంద్ర మౌళి, శరత్, మహమ్మద్, షీప్ ఫారం శీన, తిరుపతయ్య, జనసేన నాయకులు మహేష్, సురేష్, రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్

విద్యార్థుల కేరింతలతో మార్మోగిన కళాక్షేత్రం

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల, జాతీయ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్-2023 శనివారం రాత్రి వైభవంగా ముగిసింది. విద్యార్థినీ, విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వర్సిటీలోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రం మార్మోగింది. అదేవిధంగా విద్యార్థులకు పలు వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తర్వాత విద్యార్థులే స్వయంగా సంప్రదాయ వంటకాలను తయారు చేసి ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యంగా కేవలం రూ.65కు గ్యాంగ్‌స్టార్ బిర్యానీ కౌంటర్ పెట్టడంతో కిటకిటలాడింది. అదేవిధంగా రాయలసీమ బజ్జీల కౌంటర్‌కు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఉపకులపతి రంగాజార్ధన, రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపల్ సత్యనారాయణ, కన్వీనర్ జి.మమత, తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

వ్యవసాయ బోరు వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

ఎం.రాయపురంలో తాగునీటి ఎద్దడి

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని ఎం.రాయపురం గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వేసవికి ముందే తాగునీటి ఎద్దడి నెలకొన్నా ప్రజాప్రతి నిధులు కానీ అధికారులు కానీ పట్టించు కోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. విధి లేని పరిస్థితిలో రైతులకు మొరపెట్టుకుని వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధితుడికి పరామర్శ

మడకశిర : మండల పరిధిలోని గౌడన హళ్లి గ్రామానికి చెందిన రైతు ఉప్పర వెంకటేషప్ప ను శుక్రవారం రాత్రి ఓ ఆవు పొడిచింది. పొట్టకు ఎడమ వైపున గాటు పడడంతో వైద్యులు 10 కుట్లు వేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న, ఆదినారాయణ, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు రాజగోపాల్, క్రిష్టప్ప, టిడి.పల్లి మంజునాథ్, ఈశ్వర్‌సాగర్, గంగాధర్, నరసేగౌడ్, సుధాకర్, ఆంజనేయులు, తదితరులు ఆసుపత్రికి వెళ్లి వెంకటేషప్పను పరామర్శించారు.

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు

లేపాక్షి : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలో శనివారం ప్రిన్సిపల్ నీలిమ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సిడిపిఒ రెడ్డిరమణమ్మ బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలు సమాజంలో ఏవిధంగా ఉండాలి, వారికి గల స్వేచ్ఛ, సమాన హక్కుల గురించి వివరించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. అలగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, మహిళా పోలీసులు ఉషా, ఉపాధ్యాయురాళ్లు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థుల పాల్గొన్నారు.

108లో ప్రసవం

ముదిగుబ్బ : మండల పరిధిలోని మద్దన్నగారిపల్లి గ్రామానికి చెందిన వనజ శుక్రవారం అంబులెన్స్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు శుక్రవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో ముదిగుబ్బ 108కు సమాచారం అందించారు. మద్దన్నగారిపల్లి నుంచి ముదిగుబ్బ ప్రభుత్వాసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో 108లోనే ప్రసవించింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్టు 108 సిబ్బంది రవికుమార్, బాల ఓబులేసు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

పుట్టపర్తి రూరల్ : అనిల్ కేసరి మీనా సహకారంతో శనివారం మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో 120 మంది విద్యార్థులకు శ్రీవాణి బ్లూ సమ్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, చిరుధాన్యాలు, అరటిపండ్లు, లడ్డూలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏచూరి శ్రీవాణి శ్రీనివాస్, లలిత జవహర్‌లాల్, సాయిఅఖిల, అశ్వని, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు మంగళకర విద్యార్థిని

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థిని సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. బి.కాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె.ధరణి ఇటీవల గుంతకల్లులో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాలి యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 22న తమిళనాడులోని అలిగప్ప యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో ఎస్కే యూనివర్సిటీ తరఫున ధరణి పాల్గొననుంది. ధరణిని కరస్పాండెంట్ సురేష్‌కుమార్, ఎఒ జయచంద్రరెడ్డి, ప్రిన్సిపల్ ఎ.రమేష్‌బాబు, అధ్యాపక బృందం అభినందించారు.

కె.ధరణి

తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండల పరిధిలోని కొటిపి గ్రామానికి చెందిన బోయ నాగరాజు మృతిపై పోలీసులు కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే కేసు నమోదు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని సిపిఎం నాయకులు రమణ హెచ్చరించారు. కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేసి, తహశీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాము, జిల్లా కమిటీ సభ్యులు గోపాల్, తల్లి గంగమ్మ, రామంజప్ప, సరస్వతమ్మ, రత్నమ్మ, బాలు, సోమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

కాంట్రాక్టులపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి పనులపై ఏదీ..?

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై పరిటాల సునీత ధ్వజం

ప్రజాశక్తి-కనగానపల్లి

సొంత గ్రామానికి రోడ్లు వేయించుకోలేని అసమర్ధ ఎమ్మెల్యే రాప్తాడు నియోజకవర్గంలో ఉన్నారని మాజీ మంత్రి పరిటాల సునీత తీవ్ర విమర్శలు చేశారు. టిడిపి-జనసేన సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా అనంతపురం-తగరకుంట రోడ్డును వారు పరిశీలించారు. భోగినేపల్లి, పాలచర్ల, తగరకుంట గ్రామాల మధ్య గుంతలు పడిన రోడ్లపై 'వై ఎపి హేట్స్ జగన్' బోర్డు పెట్టి నిరసన తెలిపారు. సునీతతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్ ఇతర నాయకులు ఈ మార్గంలో వెళ్తున్న వాహనదారులు, గ్రామస్తులతో రోడ్డు పరిస్థితిపై ఆరా తీశారు. సునీత మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి కాంట్రాక్టులు, డబ్బు మీద ఉన్న శ్రద్ధ నియోజకవర్గంలో

రోడ్లపై గుంతలను పరిశీలిస్తున్న చిలకం, టిడిపి-జనసేన నాయకులు

అభివృద్ధి పనులపై లేదన్నారు. ఈ మార్గంలో రూ. 60 కోటతో పనులు చేపట్టిన ప్రకాష్‌రెడ్డి ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికే ముగ్గురు కాంట్రాక్టర్లు మారారని, బిల్లులు చెల్లించకపోవడంతో ఎవరూ పనులు చేయడం లేదన్నారు. పరిటాల కుటుంబాన్ని విమర్శించే సమయాన్ని దీనిపై పెట్టి ఉంటే ఇప్పటికే రోడ్డు పూర్తయి ఉండేదన్నారు.

గుంతల రోడ్లు కనిపించలేదా జగన్..? : చిలకం

ధర్మవరం టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా అధ్వాన్నంగా తయారైన రోడ్లను బాగుచేయాలన్న ఆలోచన రాలేదా జగన్ అంటూ జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. 'గుంతల ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా శనవారం జనసేన, టిడిపి ఉమ్మడి సారథ్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద, ధర్మవరం నుంచి అప్రాచెరువు, గొట్లూరు నుంచి మష్టూరు వెళ్లే రోడ్లపై ఏర్పడిన గుంతలను వారు పరిశీలించారు. ఈ దారిలో వెళ్లే ఆర్టీసీ డ్రైవర్‌తో చిలకం మాట్లాడగా రోడ్లు గుంతలమయం కావడంతో బస్సు నడపడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆర్టీసీ డ్రైవర్ వాపోయాడు. చిలకం మాట్లాడుతూ వైసిపి పాలనలో ఎక్కడా ఒక మీటరు రోడ్డు వేసిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధ్వాన్నమైన రోడ్లపై నిత్యం అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్తుంటారని, వారికి ఈ రోడ్ల దుస్థితి కనిపించలేదా అని ప్రశ్నించారు. ఈ రోడ్లపై వాహనచోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, ప్యాదిండి వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాయకులతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న పరిటాల సునీత

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

గోరంట్ల : మండల వ్యాప్తంగా రహదారుల్లో గుంతలు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారిందని, తక్షణమే మరమ్మతులు చేయాలని టిడిపి, జనసేన పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక కదిరి రోడ్డులో ఉన్న ఎస్‌ఎపిఎస్ జూనియర్ కళాశాల వద్ద ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతల వద్ద వారు నిరసన తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సైకో పోవాలి చంద్రబాబు రావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, జిల్లా కార్యదర్శి వేణు రాయల్, అజ్మతుల్లా, మనిశేఖర్, రెడ్డిపల్లి నరసింహులు, నరేంద్ర, శ్రీనివాసులు, జయరాం, రాఘవనాయుడు, జనసేన నాయకులు సురేష్, వెంకటేష్, సంతోష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో మహిళ మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని శిర రహదారిపై తుమ్మలకుంట గ్రామ మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహణం ఢీకొని గుర్తు తెలియని మహిళ(50) మృతి చెందినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఆమె నీలం రంగు పంజాబి డ్రస్సు ధరించి ఉందన్నారు. చిలమత్తూరు విఆర్ఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించామన్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు చిలమత్తూరు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కనగానపల్లి : మండల పరిధిలోని మామిళ్లపల్లి వద్ద హైవేపై ఓ కల్వర్టు పక్కన సుమారు 35 ఏళ్ల పురుషుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని చూసి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ హనుమంతరెడ్డి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ శవంపై ఎలాంటి గాయాలు లేవని, ఎక్కడో హత్యచేసి బెడ్ షీట్‌లో కప్పి తీసుకొచ్చి శుక్రవారం రాత్రి ఇక్కడ కాల్చి ఉండవచ్చని తెలిపారు. సమాచారం తెలిస్తే సిఐ 9440796835, ఎస్ఐ 9490109743 నంబర్లకు తెలపాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

బత్తలపల్లి : నార్పల-బత్తలపల్లి రహదారిలో స్థానిక జాతీయరహదారి కూడలి వద్ద విజిలెన్స్ అధికారులు పి.సాయి ప్రసాద్ స్థానిక మండల రెవెన్యూ అధికారులతో కలసి తనిఖీలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటిని సిఎస్‌డిటికి అప్పగించారు. బియ్యం రవాణా చేస్తున్న రాగే ఆంజనేయులు, గుజ్జల రాజేష్, గుజ్జల ప్రకాష్, వాహన యజమాని గుజ్జల మహేష్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

ప్రజాశక్తి-పరిగి

మండల వ్యాప్తంగా విద్యుత్ కోతలను నివారించి, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రజాప్రతి నిధులు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖల అధికారులు ఈ 3 నెలల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై చర్చించారు. డ్వాక్రా సంఘాల నిర్వీర్యానికి వెలుగు అధికారులే కారణమని, యానిమేటర్ నుంచి ఎపిఎం వరకూ సంఘాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. లో వోల్టేజీ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువ అయ్యాయన్నారు. రైతులకు 9 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. మండలంలో జగనన్న భూ సర్వే కార్యక్రమం 80 శాతం పూర్తయిందని త్వరలోనే మండల వ్యాప్తంగా పూర్తి చేస్తామని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సవిత ప్రభాకర్, ఎంపిడిఒ సరస్వతి, స్పెషల్ ఆఫీసర్, సర్పంచులు, ఎంఎపిటిసి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో విద్యుత్ సమస్యలపై వివరణ ఇస్తున్న ఎఇ

వృద్ధులకు అన్నదానం చేస్తున్న డాక్టర్ పద్మలత

సేవాభావం అలవర్చుకోవాలి

ధర్మవరం టౌన్ : ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని ప్రభుత్వాసుపత్రి సివిల్ సర్జన్. డాక్టర్ ఎం.పద్మలత సూచించారు. డాక్టర్ పద్మలత మామ కుందూ వసంతులు జ్ఞాపకార్థం శనివారం మండల పరిధిలోని గొట్లూరు అనాథాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పద్మలత మాట్లాడుతూ అనాథాశ్రమంలోని వృద్ధులు దైవ స్వరూపులని, తల్లిదండ్రులతో సమానులు అవుతారని, వారికి అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ప్రఫుల్ల చంద్ర, పద్మలత భర్త ఉదయ్‌శీనయ్యతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా 104 వైద్యసేవలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని మొండెంవారిపల్లి గ్రామంలో శనివారం వైద్యాధికారి లేకుండానే 104 సిబ్బంది ప్రజలకు తూతూమంత్రంగా వైద్య సేవలు అందించారని సిపిఐ మండల కార్యదర్శి వంకమద్ది, జి.రమణ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్యాధికారి పర్యవేక్షణలో 104 సేవలను అందుబాటు తేగా వైద్యుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదని మండిపడ్డారు. మండలానికి ఇద్దరు డాక్టర్లను నియమించినా గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు తూతూ మంత్రంగానే అందుతున్నాయన్నారు. ఆసుపత్రికి వైద్యులు రోజు విడిచి రోజు వస్తుంటారన్నారు. ఆసుపత్రిలో బిపి మిషన్‌లు పనిచేయడం లేదని చెప్పి వెనక్కి పంపుతున్నారన్న విషయంపై వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా 'మా ఇష్టం వచ్చినట్లు చూస్తాం అడగడానికి మీరెవరు' అని సిపిఐ నాయకులపై మండిపడ్డారు.

26 నుంచి ఆర్టీసీ కార్గో మాసోత్సవాలు

కదిరి టౌన్ : ఈ నెల 26 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకూ ఎపిఎస్ ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తామని, ఈ మాసోత్సవాల్లో బుక్ చేసిన వినియోగదారులకు 'లక్కీ డిప్ డ్రా' ద్వారా పెన్నార్ సీడ్స్, ఐడియల్ అగ్రి బయోటెక్, కదిరి సౌజన్యంతో ముగ్గురికి బహుమతులు అందజేస్తున్నట్లు కదిరి డిపో మేనేజర్ బి.మైనుద్దీన్ తెలిపారు. లక్కీ డ్రాలో పాల్గొనేందుకు బుకింగ్ ఎల్ఆర్ నెంబర్‌ను రాసి కార్గో ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలన్నారు. ఈ డ్రాకు జిల్లా ప్రజారవాణా అధికారి మధుసూదన్ ఈ నెల 26ం తేదీ హాజరై విజేతలను ప్రకటిస్తారన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

లేపాక్షి : స్థానిక ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం(నేడు) ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చలపతి తెలిపారు. గుండె, కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

బాధితురాలికి పరామర్శ

అమరాపురం : మండల పరిధిలోని మద్దనకుంట ఎంపిటిసి హనుమంతరాయ భార్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సర్పంచి వాగేష్, నాయకుడు నారాయణ పరామర్శించారు.

20న కార్తీక వనభోజనాలు

హిందూపురం : కార్తీక మాసంలో వన భోజనాలు చేయడం సంప్రదాయ మని బలిజ సంఘం నాయకులు రాయల్ గోపాల్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆయన సంఘం నాయకులు వెంకటరాముడు, విజయ్, నారాయణస్వామి, నాగరాజుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లా బలిజ కులస్తులతో ఈ నెల 20వ తేదీ పట్టణంలోని లక్ష్మీపురం బాలాజీ మందిరం వద్ద వన భోజనాలు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 14 నియోజక వర్గాల బలిజ కులస్తులు కుటుంబ సమేతంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరం పరిష్కరించేందుకే మీ ఇంటి వద్దకు వచ్చానని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'(గుడ్ మార్నింగ్) కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే పట్టణంలోని 38వ వార్డులో పర్యటించారు. స్థానికుల విన్నపం మేరకు ఎప్పటికప్పుడు డ్రెయినేజీ కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను ఆదేశించారు. ఇంటిపట్టా వచ్చినా బిల్లులు పడలేదని పలువురు జగనన్న కాలనీల లబ్ధిదారులు విన్నవించగా బిల్లులు త్వరితగతిన పడేలా చూడాలని హౌసింగ్ ఎఇని ఆదేశించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ మీ పరిధిలో ఏ చిన్న సమస్యా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అర్హులకు ఇంటి వద్దకే వెళ్లి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట హౌసింగ్ ఎఇ బాలాజీ, మున్సిపల్ ఎఇ ప్రతాప్, టూటౌన్ ఎఎస్ఐ దోనాసింగ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షంషాద్ బేగం, కోఆప్షన్ సభ్యులు కరీం, కౌన్సిలర్లు, నాయకులు, వాలంటీర్లు ఉన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

రోడ్ల దుస్థితిపై నేడు టిడిపి-జనసేన నిరసన

ప్రజాశక్తి-కదిరి టౌన్

టిడిపి-జనసేనపార్టీ ఉమ్మడి కార్యాచరణ పోరాటంలో భాగంగా ఆదివారం(నేడు) 'రాష్ట్రానికి రహదారులేవీ' పేరుతో పట్టణంలోని కోనేరు వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టిడిపి, జనసేన ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్, భైరవ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని కందికుంట నివాసంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం జగన్ అబివృద్ధిని పూర్తిగా విస్మరించి ఓటు బ్యాంకు కోసం పథకాల పేరుతో మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా అరాచక పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో రహదారుల దుస్థితి ఘోరంగా తయారైందని, వైసిపి ప్రభుత్వం గంపెడు మట్టి వేయలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రగల్బాలు తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. బైపాస్ రోడ్డుకు నేటికీ పరిహారం అందక వైసిపికి చెందిన వారే బైపాస్ నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని, ఈ ప్రభుత్వంలో బైపాస్ పూర్తయ్య పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం రోడ్ల దుస్థితిపై స్పందించకపోతే భవిష్యత్తులో కదిరి-రాయచోటి రోడ్డు దుస్థితిపై కదిరి నుంచి నంబులపూలకుంట వరకూ రోడ్లు పై వంటావార్పు కార్యక్రమం తలపెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కాయల చలపతి, నాగేంద్రకుమార్, కుటాల లక్ష్మణ, కిన్నెర మహేష్, లోకేష్, రవి, కెవి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట, భైరవప్రసాద్

మడకశిర : రోడ్ల దుస్థితిపై టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడి కార్యాచరణలో భాగంగా ఆదివారం(నేడు) స్థానిక మధుగిరి రోడ్డులో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పట్టణ కన్వీనర్ మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కళ్లుమర్రి సర్పంచి నాగరాజు, కన్నా, కోట్ల రంగయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారని, కావున పార్టీల నాయకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కులగణన సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-చిలమత్తూరు

కులగణలో భాగంగా కుటుంబ ఆర్థిక స్థితిగతులపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని కులగణన మాస్టర్ ట్రైనర్ నరేష్ క్రిష్ణ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా వారు స్వచ్ఛంధంగా ఇచ్చే సమాచారాన్ని సేకరించాలన్నారు. సేకరించే సమాచారం వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లదని, మరిన్ని మెరుగైన పథకాలు రూపొందించడం కోసం ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట : ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ మండలంలో కులగణన ఇంటింటి సర్వే నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్, ఎంపిడిఒ రామనాయక్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కులగణనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముందుగా గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలని, తర్వాత ప్రతి ఇంటికీ వెళ్లి ఆధార్ కార్డు వివరాలు తీసుకొని సర్వే నమోదు చేయాలన్నారు. కుటుంబ యజమాని లేని పక్షంలో ఉన్న కుటుంబ సభ్యులతో వేలిముద్ర వేయించుకోవాలన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 15 నుంచి 20 తేదీ వరకూ కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తారని అందులో సచివాలయ పరిధిలో 15 ఏళ్లు నిండిన ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. మండల స్థాయిలో డిసెంబర్ 21 నుంచి జనవరి 4వ తేదీ వరకూ పోటీలు నిర్వహిస్తారని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు రవి, బాషా, రఫీ, ఓబులమ్మ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని ఇస్లాపురం సహకార సంఘం సొసైటీ బ్యాంకులో శనివారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను సొసైటీ అధ్యక్షుడు సల్లా సూర్య ప్రకాశరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా బ్యాంకు ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు నూతనంగా చేసిన సవరణలు, చట్టాలపై అవగాహన కల్పించారు. సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఉద్యోగీ తనవంతుగా కృషి చేయాలని సూచించారు. అనంతరం పెనుకొండ సబ్ డివిజన్ సహకార ఆడిటర్ ఇన్‌స్పెక్టర్ రవి మాట్లాడుతూ రైతు పరస్పర సహకార పరపతి సంఘం అన్నింటిలోనూ ముందంజలో ఉందన్నారు. రైతులు పండించిన రాగులు, వేరుశనగ, కందులు, తదితర పంటలను రైతు సహకార పరపతి సంఘం ద్వారానే కొనుగోలు చేసి రైతులకు చేదోడుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ డివిజనల్ సహకార ఆడిటర్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవి, ఎడిసిసి బ్యాంకు మేనేజర్ జి.నాగభూషణం, బ్యాంకు సూపర్‌వైజర్ నితిన్‌విశ్వనాథ్, అసిస్టెంట్ మేనేజర్ రంగలక్ష్మమ్మ, బ్యాంకు సిబ్బంది హాలీంబాషా, పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.హరికృష్ణ, సొసైటీ సిబ్బంది రామ్మోహన్, నాగార్జున, నరసింహ, సొసైటీ రైతులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా సోమగట్టలో సహకార సంఘం జెండాను ఆవిష్కరించి వందన సమర్పన చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ అమర్‌నాథ్, వైసిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, సదాశివరెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ ఇంద్రజ, అంబికా, తదితరులు

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

అన్నిదానాల్లో అన్నదానం శ్రేష్టమైందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వెలిసిన అయ్యప్పస్వామి ఆలయ అన్నదాన భవనంలో శనివారం ఛైర్‌పర్సన్‌తో పాటు అంబికా లక్ష్మినారాయణ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షులు డిఇ రమేష్‌కుమార్, కొల్లకుంట అంజినప్ప, గురుస్వామి రవిటాగూర్, అమర్‌నాథ్, పరిమళ, విజయలక్ష్మి, వెంకటేష్, మంగేష్, దుర్గానవీన్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి స్థలం కోసం వినతి

గాండ్లపెంట : గాండ్లపెంటలో అంబేద్కర్ భవనానికి స్థలం మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎస్సీ, ఎస్టీ నాయకులు శనివారం తహశీల్దార్ హమీద్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్థలం మంజూరు చేయాలని కోరుతూ కొన్నేళ్లుగా పలుమార్లు వినతి పత్రాలు అందజేశామన్నారు. స్పందించిన తహశీల్దార్ కమ్యూనిటీ భవనానికి స్థలం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో గోపాల్ నాయక్, బాలకృష్ణనాయక్, జంపాల రమణ, కొండయ్య, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : తలుపులకు చెందిన రెడ్డిబాషా బట్రేపల్లి వాటర్ ఫాల్స్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి స్థానిక ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. రెడ్డిబాషా కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు. రెడ్డిబాషా మృతదేహా నికి సిఇసి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించి, అతడి కుటుంబ సభ్యులకు రూ. 20వేలు అందజేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి-బుక్కపట్నం

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా శనివారం ఆయన బుక్కపట్నంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్లిరెడ్డి, యశోదరాయుడు, బాలు, రామకృష్ణ, షామీర్ బాషా, శ్రీనివాసులు, వాజిద్, సుధీర్, మంజు, కుమార్. నాగేంద్ర, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని బాలసముద్రం పంచాయతీ కొక్కంటి క్రాస్‌లో టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, చంద్రబాబుపై అక్రమ కేసులు, వైసిపి అరాచక పాలన గురించి వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రాన్ని అథోగతిపాలు చేశాడని, ఇసుక, మద్యం, జగనన్న ఇళ్లు, తదితర పథకాల్లో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి వాటిపై ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీలు, నాయకులను అన్యాయంగా జైలు పాలు చేస్తూ సైకోలా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో వైసిపిని చిత్తుచిత్తుగా ఓడించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్‌నాయుడు, వెంకటరమణ, సోంపాలెం నాగభూషణం పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి పల్లె

నేడు కురుబల గుడికట్ల సంబరాలు

పుట్టపర్తి క్రైమ్ : అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం(నేడు) నిర్వహిస్తున్న గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ, గౌరవాధ్యక్షుడు కురుబ శివానంద ఆధర్వంలో శనివారం పట్టణంలోని సాయిసదన్ అతిథి గృహంలో సంఘం ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కురుబల సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే ఈ సంబరాలను చాలా ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నామని, సంబరాలకు ఉమ్మడి జిల్లాలోని కురుబలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గురవయ్యలు, డోలు కళాకారులు, తగరు, జోగి, తదితర కళాకారులు పాల్గొని తరత రాలుగా వస్తున్న ఆచారాలను భావిత రాలకు వారసత్వంగా అందించనున్నామ న్నారు. కార్యక్రమంలో సంఘం నాయకు లు కేసాని ఆదినారాయణ, బన్యాల రమేష్, పెప్సీ ప్రభాకర్, కమ్మన్న, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న కురబ సంఘం నాయకులు